ప్రజాశక్తి
మంగళవారం 14 అక్టోబరు 2025
5
అల్లూరి సీతారామరాజు

కందిరీగల దాడితో యువతి మృతి

ప్రజాశక్తి -అనంతగిరి: గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో పశువులు మేత కోసం వెళ్లిన యువతిపై కందిరీగలు దాడి చేయడంతో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథన మేరకు. మండలంలోని కోనాపురం పంచాయతీ పరిధి కొరాయిగుడ గ్రామానికి చెందిన కిల్లో. శాంతి (20) ఆదివారం మధ్యాహ్నం పశువుల మేత కోసం గ్రామానికి సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో పశువుల కాపరిదారులతో కలిసి వెళ్లింది. ఆ సమయంలో అటుగా వెళ్లిన శాంతి పై కందిరీగలు ఒక్కసారి గుంపుగా దాడి చేయడంతో అక్కడ నుండి తప్పించుకునేందుకు దూరం పరుగులు తీసినప్పటికి ఫలితం లేకపోయింది. తోటి పశువుల కాపరులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వైద్యం నిమిత్తం అరకు ఏరియా ఆసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమించి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మరి కొంతమంది పశువుల కాపరులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఆదివాసీలకు అన్యాయం చేస్తారా ?

- ఏజెన్సీలో శత శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాల్సిందే..
- స్పెషల్ డిఎస్‌సి ప్రకటించండి
- ఐటిడిఎలను ముట్టడించిన వేలాది మంది గిరిజనులు
- జోరువానలోనూ భారీ ర్యాలీలు, ఆందోళనలు

పాడేరులో నిరసన చేపడుతున్న నిరుద్యోగులు, నేతలు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

ఏజెన్సీలో ఆదివాసీలకు శత శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాల్సిందేనంటూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యాన జిల్లాలోని చింతూరు, రంపచోడవరం, పాడేరు ఐటిడిఎలను గిరిజనులు ముట్టడించారు. ఆయా చోట్ల జరిగిన ఆందోళనల్లో పెద్ద సంఖ్యలో గిరిజన యువతీ యువకులు పాల్గొన్నారు. తొలుత భారీ ర్యాలీలు నిర్వహించారు. రహదారులపై బైఠాయించారు. జోరువానలోనూ దిక్కులు పిక్కటిల్లేలా వారు నినదించారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూపారు. తీరుమారకుంటే ప్రభుత్వాలపై తిరుగుబాటుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. తమ సమస్యలను పరిష్కరించే వరకూ కదిలేది లేదని భీష్మించుకు కూర్చోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

చింతూరు : ఆదివాసీ గిరిజన సంఘం, ఆదివాసీ జెఎసి, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యాన చలో చింతూరు ఐటిడిఎ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ ఆదివాసీలకు గత ఎన్నికల సమయంలో సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఆదివాసీలకు ఏజెన్సీలో శతశాతం ఉద్యోగావకాశాలు కల్పించే జిఒ నెంబర్ 3ని రద్దు చేసి పాలకులు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఐదో షెడ్యూల్ ఏరియాలో గవర్నర్‌కు, రాష్ట్రపతికి విచక్షణమైనటువంటి అధికారాలు ఉన్నాయని, టిఎసి తీర్మానం చేసిన పిదప వారికి చేరితే రెగ్యులేటర్ ఆర్డర్స్ ద్వారా ఆదివాసీలకు వంద శాతం రిజర్వేషన్ సాధ్యమేనని అన్నారు. కానీ ప్రభుత్వాలు ఆ రకమైన ప్రయత్నాలు చేయడం లేదన్నారు. ఆదివాసీ ఓట్లతో గెలిచినటువంటి ఎమ్మెల్యేలు ఏజెన్సీ ప్రాంతంలోని ఉద్యోగ రిజర్వేషన్‌పై మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు ఆదివాసీ జెఎసి నాయకులు మడివి నెహ్రూ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కుంజా శ్రీను మాట్లాడుతూ ఆదివాసీ ప్రజానీకాన్ని ఏకం చేసి భవిష్యత్తు ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాయం వెంకటేష్, గొర్రె మీనా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్, నాయకులు సీసం సురేష్, పూనం ప్రదీప్, కారం నాగేష్, జల్లి నరేష్, కుంజా అనిల్, న్యాయవాది మడివి రవితేజ, ముళ్ళ కనకా రెడ్డి, చిక్కాల బాలకృష్ణ, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, కూనవరం జెడ్‌పిటిసి గుజ్జ విజయ, తుమ్మల ఎంపిటిసి వేక రాజ్ కుమార్, ఏజే కోడూరు సర్పంచ్ అగరం సుబ్బలక్ష్మి, ఇ.చిచ్చడి రాము, పాయం రతన్, మోసం రాంబాబు, కూర చిట్టిబాబు, సలం వెంకటేష్, పోడియం శ్యామల, పూనం ప్రవీణ్, బీరబోయిన గౌతమ్ కుమార్ పాల్గొన్నారు.

రంపచోడవరం/రాజవొమ్మంగి : ఆదివాసీ హక్కులు, ఉద్యోగాల సాధన కమిటీ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యాన గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు రంపచోడవరం ఐటిడిఎను ముట్టడించారు. 2025 మెగా డిఎస్‌సిలో తమకు జరిగిన అన్యాయంపై మండిపడ్డారు. జోరువానలోనూ ఆందోళన కొనసాగించారు. రహదారిపై బైఠాయించారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకూ కదిలేది లేదని గేటు ముందు భీష్మించుకు కూర్చున్నారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, బొప్పెన కిరణ్, ఇతర ఆదివాసీ నేతలు వంతు బాలకృష్ణ, కంగాల శ్రీనివాస్, మడకం బంగారు బాబు, రాజ్ కుమార్, టి.పద్మ, మద్దేటి అంజిరెడ్డి, సిరిమల్లి రెడ్డి, ఎం.వాణిశ్రీ తదితరులు మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు అరకులో ఆదివాసీ నిరుద్యోగులకు వందశాతం ఉద్యోగాలను ఏజెన్సీలో కల్పిస్తామని హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. టిఎసి ద్వారా తీర్మానం చేసి షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. తొలుత గిరిజనులు అంబేద్కర్ సెంటర్ నుండి ఐటిడిఎ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ నాలుగు గంటలపాటు ఆందోళన చేపట్టారు. ఆందోళన శిబిరం వద్దకు రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్ రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ చేరుకుని ఆదివాసీ నేతలతో చర్చలు జరిపారు. డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేసి వాటి అమలు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజనులకు న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని నేతలు స్పష్టం చేశారు. అధికారుల హామీతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు జి.లోవప్రసాద్, రాజ్ కుమార్, రత్నాకర్, ఎం.సూర్య కుమారి, సిహెచ్.శశి ప్రీతం, కారం రామన్న దొర, గణేష్, శ్రీను, యలగాడ నాగేశ్వరరావు, కోసు లచ్చన్నదొర, కత్రం దాసు, ఎస్.బాబూరావు, సిహెచ్.సన్యాసిరెడ్డి, సిహెచ్.విద్యాసాగర్, పెద్ద సంఖ్యలో ఆదివాసీ నిరుద్యోగులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువతీ యువకులు, పీసా కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో దిగివచ్చిన అధికారులు

రంపచోడవరం ఐటిడిఎను ముట్టడించిన ఆదివాసీలు

చింతూరు ఐటిడిఎ ముట్టడి కార్యక్రమంలో మాట్లాడుతున్న అప్పలనర్స

పాడేరు టౌన్: మెగా డిఎస్సి-2025లో షెడ్యూల్డ్ ప్రాంత పోస్టులు, పాడేరు ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ పోస్టులను గిరిజనేతరులతో భర్తీ చేయడం అన్యాయమని ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ జిల్లా కన్వీనర్ ధర్మన్న పడాల్ అన్నారు. అధికారంలోకి వస్తే జిఒ-3 రిజర్వేషన్ పునరుద్ధరిస్తామని ప్రతిపక్ష నేతగా సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా మెగా డిఎస్‌సి-2025 నిర్వహించడంతో ఆదివాసీ నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని, వెంటనే ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ ఇచ్చి ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మెగా డిఎస్ సి-2025లో ఆదివాసీలకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ, జిఒ-3 రిజర్వేషన్ ప్రత్యామ్నాయంపై సిఎం చంద్రబాబు హామీని నిలబెట్టుకోవాలని, ఆదివాసీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి నిరుద్యోగుల సంఘం, ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ ముట్టడి కార్యక్రమం జరిగింది. ఏజెన్సీ నలుమూలల నుంచి ఆదివాసీ యువత, నిరుద్యోగులు తరలివచ్చారు. స్థానిక సిఐ దీనబంధు ఆధ్వర్యంలో పోలీసులు ఐటిడిఎ గేటు లోపలికి ఆందోళనకారులు వెళ్లకుండా గేటు వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతకుముందు ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ నుంచి గిరిజన నిరుద్యోగులు ర్యాలీగా ఐటిడిఎ గేటు వరకు చేరుకున్నారు. గేటు లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అనుమతించ లేదు. గేటు బయట నిరసన తెలిపేందుకు మాత్రమే పోలీసులు అనుమతించారు. దీంతో, గేటు వద్ద మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 4 గంటల వరకు ధర్నా చేశారు. జిఒ-3 రిజర్వేషన్ ప్రత్యామ్నాయం చూపాలని, ఆదివాసి స్పెషల్ డిఎస్సి నిర్వహించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నిరుద్యోగ సంఘం నాయకులు ఎస్.సత్యనారాయణ, వి.స్వాతిలత, పి. అరుణ కుమారి, చిన్నతల్లి, హరి ప్రసాద్, శంకర్, ప్రశాంత్ రాజు, చిరంజీవి, రవి, విష్ణుమూర్తి, కృష్ణం పడాల్, అఖిల్, స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ నాయకులు భాను సిహెచ్ రావు, నరేష్ పాల్గొన్నారు.

ధారకొండ పాఠశాలలోకి చేరిన వర్షపు నీరు

ఏజెన్సీలో కుండపోత

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం ధారకొండలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ప్రాథమిక పాఠశాల నీట మునిగింది. మధ్యాహ్నం భోజనాలు చేయడానికి విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. వంట గదిలోకి వరదనీరు చేరిపోయింది. హెచ్‌ఎం సుబ్బారావు మధ్యాహ్నం పాఠశాలకు సెలవు ప్రకటించి విద్యార్థులను సురక్షితంగా వారి ఇళ్లకు పంపించినట్లు తెలిపారు. జీకే వీధి మండలం సీలేరులో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో సుమారు గంటసేపు భారీ వర్షం కురిసింది. మసీదు లైన్లో డ్రైనేజీ లేకపోవడంతో రోడ్లపై నుంచి వరదనీరు ప్రవహించి లోతట్టున ఉన్న ఇళ్లల్లో చేరింది.

చింతూరు : మండలంలో సోమవారం ఉదయం 9 గంటల నుండి ఏకధాటిగా కుంభవృష్టి వర్షం కురిసింది. ఎస్సీ, బీసీ కాలనీల రోడ్లు జలమయమైనాయి. కొన్నిచోట్ల రహదారులు కూడా కనిపించకుండా వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

18 నుండి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: జనవిజ్ఞానవేదిక ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 18న పాఠశాల స్థాయిలో, నవంబర్ 1న మండల స్థాయిలో, నవంబర్ 23న జిల్లాస్థాయిలో, డిసెంబర్ 12,13,14 న రాష్ట్రస్థాయిలో జరిగే చెకుముకి సైన్స్ సంబరాలు (చెకుముకి సైన్సు టాలెంట్ టెస్ట్) విజయవంతం చేయాలని జనవిజ్ఞానవేదిక అల్లూరి జిల్లా అధ్యక్షులు టి.బొజ్జియ్య సోమవారం కోరారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాజవొమ్మంగి జిల్లా కమిటీ తరపున చెకుముకి సంబరాలు పోస్టర్ ఆవిష్కరణ పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం ఆరుమిల్లి ఆదిలక్ష్మి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బొజ్జియ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయడంతో పాటు, శాస్త్రీయ ధృక్పథాన్ని పెంపొం దించుకునేలా ఉపాధ్యాయులు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శాంతిప్రియ, హరిశ్చంద్రప్రసాద్,సత్యబాబు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకుడు కొండారెడ్డి

పరిహారం అందక, పనుల్లేక అవస్థలు

ప్రజాశక్తి- విఆర్‌పురం: జీడిగుప్ప పంచాయతీ జీడిగుప్పలో ఆదివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం లచ్చిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సిపిఎం నాయకులు కదల కొండారెడ్డి మాట్లాడుతూ పోచవరం నుండి రాయగూడెం, జీడిగుప్ప, కోటారుగము గ్రామాల్లో పలువురు పనుల్లేక అవస్థలు పడుతున్నారని పోలవరం బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురై ఇబ్బంది పడ్డారని అయినా మండల అధికారులు, ప్రభుత్వం కనీసం కన్నెత్తి చూడలేదని, ఈ ప్రభుత్వం వరద నష్టపరిహారం కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందా అని ఆయన ప్రశ్నించారు.

కమిటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి 2017-18లో కటాఫ్ డేట్‌గా పరిగణించి చాలామంది యువతకు ఆర్అండ్ఆర్ ఇవ్వలేదని కానీ ఇప్పుడు వారంతా పెళ్లిళ్లు అయిపోయి కుటుంబాలతో ఉన్నారని వారికి ఏ నష్టపరిహారం ఇవ్వలేదని మళ్లీ రీసర్వే చేసి ఆర్అండ్ఆర్ ఇవ్వాలన్నారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఖాదర్‌బాబు ,పార్టీ నాయకులు భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఊడిన బస్సు చక్రం.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని బర్నగూడెం సమీపంలో రాజవొమ్మంగి నుండి ఏలేశ్వరం వైపు వెళుతున్న ఏలేశ్వరం డిపో ఆర్టీసీ బస్సు ముందు చక్రం అకస్మాత్తుగా ఊడిపోయింది డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. ఏలేశ్వరం మండలం రమణయ్యపేట నుండి రాజఒమ్మంగి మండలం చెరుకుంపాలెం వరకూ ఆర్అండ్‌బి రహదారి అధ్వానంగా తయారైంది. పెద్దపెద్ద గోతులతో ఉన్న ఈ రహదారిలో నిత్యం ప్రమాదాల జరుగుతుండడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

టైర్ ఊడిన బస్సు

పుల్లంగిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలం ముల్లంగి పంచాయతీలో సర్పంచ్ జార్జిబాబు ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలో ఎక్కడైనా వీధిలైట్లు, పారిశుధ్యం, ఇతర ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. మండలం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎక్కడబడితే అక్కడ నీరు నిల్వ ఉండటంతో ప్రతి ఇంటి వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి అభిలాష్ పాల్గొన్నారు.

బ్లీచింగ్ చల్లిస్తున్న సర్పంచ్ జార్జిబాబు

నినాదాలు చేస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు

మినీ అంగన్‌వాడీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

- సిఐటియు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉన్న మినీ అంగన్వాడీ వర్కర్లకు ప్రమోషన్లు కల్పించాలని అల్లూరి జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. అనంతరం సిఐటియు, అంగన్వాడీ వర్కర్ల, హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర దినేష్ కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్‌కి వినతిపత్రం అందించారు. కలెక్టర్ కార్యాలయం ముందు మినీ అంగన్వాడి వర్కర్లు, సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, రంపచోడవరం ఏరియా కార్యదర్శి వెంకట్, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాగ్యలక్ష్మి, దురియ నాగమ్మ, నిర్మల, రాజేశ్వరి మాట్లాడారు. పాడేరు డివిజన్ పరిధిలో 150 మంది. రంపచోడవరం డివిజన్ పరిధిలో 79 మంది అర్హులైన మినీ అంగన్వాడీ వర్కర్లకు ప్రమోషన్ కల్పించలేదని వారు చెప్పారు. వెంటనే వీరికి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి వర్కర్లకు వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో సెల్ సిగ్నల్స్ సక్రమంగా లేక పోవడంతో ఫోన్లు పనిచేయక పోవడంతో చేయలేకపోతున్నామని, తక్షణం 5జి మొబైల్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్వైజర్ పోస్టులు తక్షణం భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామాల్లో ఉన్న అంగన్వాడి టీచర్లకు ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నవంబర్లో అంగన్వాడీల ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు అంగన్వాడి సెంటర్ల మరమ్మతు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాణి, శ్రీదేవి భారతి, తదితరులు పాల్గొన్నారు.

సాగు రైతులకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అరకులోయ మండలం పెదలబుడు మేజర్ పంచాయతీ నువ్వగుడ, లింబగుడ గ్రామానికి చెందిన రైతులకు జిరాయితి పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు డిమాండ్ చేశారు. సోమవారం నువ్వగూడ, లింబగూడ గ్రామంలో సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, పేసా కమిటీ ఉపాధ్యక్షుడు కిల్లో జగన్నాథం, కె మగ్గన్న పర్యటించి రైతుల సమస్యలను అడిగితెలుసున్నారు. అనంతరం జిరాయితీ పట్టాలు ఇవ్వలేదని దీంతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రైతు భరోసా, వివిధ పథకాలకు దూరమవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, పేసా కమిటీ ఉపాధ్యక్షుడు కిల్లో జగన్నాథం మాట్లాడుతూ, దశాబ్దాల కాలం గడిచినా నేటికీ సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వలేదని తెలిపారు.గాడుగుడ, డొలిగూడ, బిస్తుగుడ, నువ్వాగుడ, లింబగూడ గ్రామాలకు పట్టాలు ఇవ్వకుండా నిలిపివేశారన్నారు.అధికారుల నిర్లక్ష్య కారణంగానే పట్టాలు జాప్యం జరుగుతుందని తెలిపారు.గతంలో ఈ గ్రామాలు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దత్తత తీసుకున్నారని, కనీసం పట్టాలు ఇవ్వలేదన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నేతలు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి

నిరవధిక సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు కాంట్రాక్ట్ కార్మికులు

ప్రజాశక్తి -సీలేరు: ఎపి ట్రాన్స్కో, జెన్కో డిస్కం సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా స్ట్రగుల్ కమిటీ తలపెట్టిన నిరవధిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని యునైటెడ్ ఎల్సిడి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ హెచ్ 176 (సిఐటియు) సీలేరు బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మణరావు పి.విష్ణుకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం 20 సంవత్సరాలుగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు చాలీచాలని వేతనాలు ఇస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తరహాలో సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2022 వేతన ఏరియర్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న చేపట్టే నిరవధిక సమ్మెలో కాంట్రాక్ట్ కార్మికులంతా ఐకమత్యంగా పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవడానికి పోరుబాట పట్టాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘ కార్యవర్గ సభ్యులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని వినతి

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థల్లో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (హెచ్‌వన్ 176 సిఐటియు) సీలేరు బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మణరావు టి.విష్ణుకుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడుతూ స్థానిక ఎపి జెన్కో ఎస్ఇ సివిల్‌చంద్రశేఖర్‌రెడ్డి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. కాంట్రాక్టర్ అండ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు తక్కువ వేతనాలు తీసుకుంటూ విధులు నిర్వహిస్తున్నారన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేసేవరకూ పోరాటం తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి తక్షణమే రెగ్యులర్ చేయాలని ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు లక్ష్మణరావు, హబీబుల్లా, రమణ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఎపి జెన్కో ఎస్ఇ సివిల్‌చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఎంపికైన విద్యార్థులు

జిల్లా స్థాయి క్రీడలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి -మారేడుమిల్లి: ఈ నెల 10వ తేదీన డివిజన్ స్థాయి బాలుర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రంపచోడవరం మండలంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల ముసురుమిల్లిలో సెలక్షన్లు నిర్వహించారు. దీనిలో భాగంగా మారేడుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 కోకోలో 9వ తరగతి విద్యార్థి కడబాల చరణ్‌కుమార్‌రెడ్డి, అండర్-17 కోకోలో కత్తుల సాయినందశివ భగవానీ రెడ్డి, అండర్ -17 జావిలిన్ త్రోలో పదోతరగతి విద్యార్థి కే ఎస్.ఎస్.ఎన్ రెడ్డి తృతీయస్థానంలో ఎంపికయ్యారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం చిన్నబాబు, డిప్యూటీ వార్డెన్ కోటేశ్వరరావు పిఈటి లచ్చిరెడ్డి, పిడి సుదర్శన్‌లకు అభినందనలు తెలిపారు.

అక్రమ కట్టడాలను తక్షణమే కూల్చి వేయాలి

- ఐటిడిఎ ఎపిఒకు వినతి

ప్రజాశక్తి-చింతూరు: అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని చింతూరు ఐటిడిఎ ఎపిఒకు సోమవారం వినతిపత్రం ఇచ్చినట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఎర్రంపేట పాతపోస్టాఫీస్ ముందు లైనులో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తు భవనం ఉందని, అదేవిధంగా చింతూరు సెంటర్‌లో జూబ్లీపార్క్‌గా పిలవబడే స్థలంలో సుమారు 50కి పైగా గిరిజనేతరులు అక్రమ కట్టడాలు కట్టి వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై డిఎఫ్ఒకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఫారెస్ట్ అధికారులు, పంచాయతీ, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. చింతూరు కేంద్రంలో అటవీశాఖకు సంబంధించి భూ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తున్నా చర్యలు లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో ఎవిఎస్పీ డివిజన్ అధ్యక్షులు కూరా చిట్టిబాబు, కారం సిరామయ్య ఉయిక రత్తయ్య, కారన్ సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎపిఒకు వినతిపత్రం ఇస్తున్న కుంజా శ్రీను

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

రహదారి సౌకర్యం లేక అవస్థలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలం తీగలవలస పంచాయతీ పనసబంధ, కిన్నెర్లోవ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు తాపుల క్రిష్ణారావు, పాంగి సోమన్న డిమాండ్ చేశారు. రహదారి సమస్యపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆదివాసి ప్రాంతంలో మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర వివక్ష చూపిస్తున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వంతో ఆదివాసులకు డోలి మోతలు తప్ప లేదన్నారు. రహదారులకు నిధులు మంజూరు అయితే సంబంధిత అధికారులు, నాయకులకు కమీషన్లతో నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలేస్తున్నారన్నారు.. పనసబంధ, కిన్నెర్లోవ గ్రామాలకు రహదారి నిర్మాణం కోసం 2017-18లో మంజూరైన నిధులు కాజేశారన్నారు. వర్షాలకు రహదారి కోతకు గురై పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్వచ్ఛందంగా శ్రమదానం పనులు చేస్తుంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు కన్నెత్తి చూడకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ సోదరి చందు, వంశీ సోదరి వచ్చు, కిల్లో జ్యోతి, సుందరి చిట్టిబాబు, సూరిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-హుకుంపేట: ఆంధ్రప్రదేశ్ గిరిజన విలేకరుల సేవా సంఘం ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ నాగ వెంకట్ సాహిత్, జిల్లా రవాణా శాఖ శ్రీధర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసి నాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అసిస్టెంట్ కలెక్టర్ చేతుల మీదుగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానంతో మరొకరి ప్రాణాన్ని కాపాడినవారమవుతామన్నారు.

జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ, గిరిజన విలేకరుల సేవ సంఘం తరపున నిర్వహించిన ఈ సేవా కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ, సీఐ సన్యాసి నాయుడు మాట్లాడుతూ, దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం మంచి పరిణామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీవో, ఎంఈఓ ఎస్.చెల్లయ్య, విద్యాశాఖ అధికారి కె.ఈశ్వరరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో సన్యాసిరావు, ఎంపీపీ కూడా రాజబాబు, పిఆర్‌జెఇ సంజీవరావు పాల్గొన్నారు.

రక్త పరీక్షలు చేయించుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

ప్రజాశక్తి-మారేడుమిల్లి: మండలంలోని గొందివాడలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మారేడుమిల్లి కౌన్సిలర్లు బి.సాయి, యల్. ప్రదీప్‌కుమార్, జి. రాజమన్యరావు, ఆర్థిక అక్షరాస్యత అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి యూనియన్ బ్యాంక్‌ఆఫ్‌ఇండియా మేనేజర్ హర్షవర్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బ్యాంకింగ్ పథకాలు, సామాజిక భద్రతా పథకాలు, డిజిటల్ బ్యాంకింగ్, ప్రైవేటు ఆర్థిక సంస్థల మోసాలు, ఆన్లైన్ బ్యాంకింగ్ మోసాలపై, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, రిజర్వ్ బ్యాంక్ అంబుడ్స్‌మన్‌పై అవగాహన కల్పించారు. ఎస్ఎస్‌టి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు బి.సాయితేజ, ఎల్.ప్రదీప్‌కుమార్, జి.రాజమన్యరావు ఆధ్వర్యంలో మారేడుమిల్లి మండలం లోతట్టు గ్రామాల ప్రజలకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. దీనిలో భాగంగా మారేడుమిల్లి మండలం గొందివాడ గ్రామానికి చెందిన గిరిజరుడు సుంత్రు రామిరెడ్డి తల్లి సూంత్రు వీరాయమ్మ గతంలో అనారోగ్యంతో మృతి చెందింది. వీరయమ్మకు మారేడుమిల్లి యూనియన్ బ్యాంక్‌లో బ్యాంక్ అకౌంట్ ఉంది. నామినిగా తన కుమారుడు రామిరెడ్డి పేరు నమోదు చేశారు. కానీ ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియదు. అన్‌క్లైమ్‌డ్ నగదు గొందివాడలో ఉందని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. సుంత్రు వీరాయమ్మ ఖాతాలో 35,000 ఉందని కుమారుడు రామిరెడ్డి నామినిగా ఉన్నారనీ తెలియజేశారు. వెంటనే మేనేజర్ స్పందించి అన్‌క్లైమ్‌డ్ నగదు నామినీకి జమ చేశారు. మేనేజర్ హర్షవర్ధన్, ఎస్ఎస్‌టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ అశోక్‌కుమార్‌కి కౌన్సిలర్లు గ్రామస్తులు బెనిఫిసర్ కృతజ్ఞతలు తెలిపారు.

కెజిబివిలో మెనూపై ఆరా

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో జిల్లా ఎస్ఎస్ఎ ఏపిసి డాక్టర్ స్వామి నాయుడు సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న భోజన మెనూను పరిశీలించి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. మెనూ నాణ్యతగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తరగతి గదుల్లో వెళ్లి విద్యార్థులకు బోధిస్తున్న విద్యా ప్రమాణాలపై అడిగి తెలుసుకునీ పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా బోధన చేయాలని సూచించారు. మెనూ అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ భవాని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పోతురాజు

సిఐటియు పోరాట ఫలితంగా
విఓఎల కాలపరిమితి సర్క్యులర్ రద్దు

సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పోతురాజు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: వెలుగు విఓఏల అభినందన సభ అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో సోమవారం టి బాలకృష్ణ అధ్యక్షతన సభ జరిగింది. ముఖ్యఅతిథిగా విఓఏల జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్ పోతురాజు హాజరై మాట్లాడారు. సిఐటియు ఆధ్వర్యంలో సుదీర్ఘకాలం పాటు పోరాట ఫలితంగా మూడు సంవత్సరాల పరిమితి సర్క్యులర్ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. విఓఏలకు ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. హెచ్‌ఆర్‌పి పాలసీ, కనీస వేతనం 26 వేలు, ప్రభుత్వం 5జి సెల్ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్బీ రాజ్ కుమార్ మాట్లాడుతూ, విఓఏల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో కోశాధికారి పోతురాజు, ఉపాధ్యక్షులు పి భాస్కర్,ఆరు మండలాల అధ్యక్షకార్యదర్శులు, రంజిత, దుర్గ, రాజు,పార్వతి,చిన్ని,సూరిబాబు పాల్గొన్నారు.

బెర్రీ బోరర్ నియంత్రణకు చర్యలు చేపట్టాలి

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: కాఫీ తోటలకు పెనుముప్పుగా మారిన 'బెర్రీ బోరర్' పురుగు వ్యాప్తిని అరికట్టడానికి యుద్ధ ప్రాతిపదికన పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రెడ్ జోన్, కంటామినెంట్ జోన్, బఫర్ జోన్లలో ఈ పురుగును నియంత్రించకపోతే కాఫీ ప్రాంతం నాశనమవుతుందని ఆయన హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటీడీఏ, కాఫీ బోర్డు అధికారులు, ఎఫ్పీఓలు, ఎన్జీఓలు, కాఫీ క్షేత్ర స్థాయి సిబ్బందితో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బెర్రీ బోరర్ నివారణకు వెంటనే చర్యలు తీసుకున్నామన్నారు. సోకిన ప్రాంతమంతా మూడు సంవత్సరాల పాటు జాగ్రత్తగా పరిరక్షణ చేయాలని సూచించారు. కిందపడిన కాఫీ కాయలకు గ్లీనింగ్ ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పురుగు సోకిన ప్రాంతాల నుండి కాఫీ పిక్కలు లేదా టార్పాలిన్, గోనె సంచులను ఇతర ప్రాంతాలకు తరలించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. సోకని ప్రాంతాల నుంచి కూడా సోకిన ప్రాంతంలోకి వీటిని తీసుకురావడానికి వీల్లేదని ఆదేశించారు. కంటామినేట్ జోన్‌లో ఉన్న రైతుల జాబితాను తక్షణమే తయారు చేయాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్, పురుగు సోకిన ప్రాంతంలోనే కాఫీ పల్పింగ్ జరిగేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. బెర్రీ బోరర్ వ్యాప్తిని నివారించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ కోరారు. మాన్యువల్ పల్పర్స్‌ను మోటార్ పల్పర్స్‌గా మార్చడానికి చర్యలు చేపడతామన్నారు. ప్రతి పంచాయతీలో గ్రామసభలు నిర్వహించి, కాఫీ బోర్డు సిబ్బంది, ఎన్జీఓలు, ఎఫ్పీఓల సమన్వయంతో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఏడాది కాఫీ నాణ్యత (క్వాలిటీ) పెంపునకు ఐటీడీఏ ద్వారా గ్రేడింగ్‌ను బట్టి 'వేరియబుల్ ధర' ను నిర్ధారించి చెల్లిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీఓ పీటీజీఎం వెంకటేశ్వర్లు, కాఫీ బోర్డు ఉపసంచాలకులు హెచ్‌ఆర్ మురళీధరా, సీనియర్ లైసెన్ ఆఫీసర్ ఎస్ రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సమస్యలపై నిరసన

రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని కరీముఖి పుట్ పంచాయతీ దాసరిపుట్ గ్రామంలో సిసి రోడ్డు , తాగునీరు, డ్రెయినేజీ, పీఎం జన్మన్ గృహాల బిల్లులు మంజూరు చేయాలని సోమవారం సిపిఎం మండల కమిటీ సభ్యులు గల్లెల నారాయణ, జి జీనా బంద్, గల్లెల సీతారాం డిమాండ్ చేశారు. గ్రామంలో ప్రజల సమస్యలపై నినాదాలు చెస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యుడు గల్లెల నారాయణ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో అనేక దఫాలు అధికారుల దృష్టికి సమస్యలతో కూడిన వినతులు సమర్పించినా ఏమాత్రం స్పందించ లేదన్నారు. దాసరిపుట్టు గ్రామంలో ఆదివాసి పీవీటీజీలు 25 కుటుంబాలలో సుమారు 150 మందితో ఉన్నారన్నారు. గ్రామంలో రవాణా సౌకర్యాలకు అనేక ఇబ్బందులు పడుతున్నామని సిహెచ్‌డబ్ల్యూ తెలిపారు. గర్భిణి, బాలింతలను ఆసుపత్రికి తరలించాలన్నా ఇబ్బంది అవుతుందని ఆమె తెలిపారు. ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టరు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు గుంట రామన్న, ఎం ప్రసాద్, ఎం నాగేశ్వరరావు, ఈశ్వరరావు, వంతల సీతారాం కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, రామన్న, ప్రసాద్ ప్రజలు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి-పాడేరు: "సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్" ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏఎస్ఆర్ జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పించారు. పట్టణంలోని వర్తక సంఘ నాయకులు, వ్యాపారులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక పాత బస్టాండ్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎ.రమేశ్ కుమార్ (జీఎస్టీ) హాజరయ్యారు. జీఎస్టీ అధికారులు ఎస్.వి. ప్రసాద్, ఎస్.మన్మధరావు, ఎల్.సన్యాసిరావు, జీఎస్టీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

అరకులోయ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్, జిఎస్టి 2.0 కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చలపతిరావు మాట్లాడుతూ, జిఎస్టి 2.0 అందరికీ ఎంతో ఉపయోగకరమని, అందరూ కొత్త స్లాబ్ రేట్లు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కే. శశి కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాడేరు: జీఎస్టీ అమలులో భాగంగా, పర్యాటక, నిర్మాణ రంగాలకు సంబంధించిన తగ్గింపు ప్రయోజనాలను వెంటనే ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ అన్నారు. జిఎస్‌టి పై కలెక్టర్ సంబంధిత అధికారులతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. హెూటల్ రూమ్ అద్దెలు తగ్గుతాయన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్' అనే నినాదంతో ప్రచారం చేయాలన్నారు. జీఎస్టీ బృందం ఈ ప్రచార పోస్టర్లు, బ్యానర్లను సిద్ధం చేసి, సరఫరా చేయాలని ఆదేశించారు.

కొలువుదీరిన కొత్త ఉపాధ్యాయులు


రాజవొమ్మంగి: జాయినింగ్ రిపోర్ట్ అందజేస్తున్న ఎంఇఒ సత్యనారాయణదొర

సీలేరు: కొత్తగా చేరిన ఉపాధ్యాయులతో హెచ్‌ఎం నాగభూషణం

ప్రజాశక్తి -చింతూరు: చింతూరు మండలంలో పాఠశాలల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్‌లో ఇప్పటివరకు మొత్తం 29 ఖాళీలకు సెకండరీగ్రేడ్ 21, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 2, స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ 1, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ 3 ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలు 2, మొత్తం 29 పోస్టులకు గాను 21 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. గిరిజన సంక్షేమ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 10, స్కూల్ అసిస్టెంట్ 1, పిజిటి 2, టిజిటి 5, పిడి 1 మొత్తం 20 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఈ డీఎస్సీతో మండలంలో అన్ని పాఠశాల్లో ఉపాధ్యాయుల కొరత తీరింది. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీలేరు: జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు నియమించిందని పాఠశాల హెచ్‌ఎం నాగభూషణం తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జెడ్‌పి హైస్కూల్‌లో 8 మంది స్కూల్ అసిస్టెంట్‌లు కొత్తగా విధుల్లో చేరారని తెలిపారు. ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థులకి బోధన చేయాల్సిన విధివిధానాలపై సూచనలు చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు

జికె వీధి మండలం సీలేరు హైస్కూల్‌లో కొత్తగా చేరిన ఉపాధ్యాయు లను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశామని సీలేరు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకర్రావు తెలిపారు. హెచ్‌ఎం నాగభూషణం కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశమై పలు అంశాలపై చర్చించామన్నారు. 2025- 26 సంవత్సరానికి పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆశిస్తున్నామన్నారు.

విఆర్‌పురం: మండలంలో కొత్తగా చేరిన ఉపాధ్యాయులకు యుటిఎఫ్ విఆర్‌పురం మండలశాఖ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యస్.నాగేశ్వరరావు ,మండల బాధ్యులు కె.వెంకట్, యన్.జగదీష్ యం.బాబు, బి.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలో వివిధ పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు చేరారని ఎంఇఒ సత్యనారాయణదొర తెలిపారు. మండలంలో ఏడుగురు ఎస్‌జిటీలు, పదిమంది స్కూల్ అసిస్టెంట్లు విధుల్లో చేరినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. విధుల్లో చేరిన ఉపాధ్యాయులు ఎంఇఒ-1 సత్యనారాయణ దొరను మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్ట్స్ అందజేసారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేతలు డి.పైడిమల్లు, టి.బొజ్జియ్య, శివకృష్ణ రమేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: 2025 డిఎస్సి ద్వారా నియామకమైన ఉపాధ్యాయులు సోమవారం మండలంలోని వివిధ పాఠశాలలు జాయినింగ్ అయ్యారు, ఈ సందర్భంగా నియామక పత్రాలను స్థానిక మండల విద్యాశాఖ అధికారి ఎస్ సుందర్రావు, ఎం ఈ ఒ 2 జి గేన్నుకు అందజేశారు. మండల వ్యాప్తంగా ఎంపీపీ, జిపిఎస్, టిడబ్ల్యూ, గవర్నమెంట్ పాఠశాలలో జాయినింగ్ అయినట్లు మండల విద్యాశాఖ అధికారి తెలిపారు.

ముంచింగిపుట్టు :: మండలంలో నూతన ఉపాధ్యాయులు 46 మంది ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి తెలిపారు.

దుంబ్రిగుడలో విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

విఆర్‌పురం: ఉపాధ్యాయులకు స్వాగతం తెలుపుతున్న యుటిఎఫ్ మండల నాయకులు

ఎన్టీఆర్ వైద్యసేవలను తక్షణం పునరుద్ధరించాలి

- గాంధీ విగ్రహం వద్ద సిపిఐ నిరసన

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు బిల్లులు చెల్లించని కారణంగా, నిలిచిన ఎన్టీఆర్ వైద్యసేవలను వెంటనే కొనసాగించాలని సిపిఐ విశాఖ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 7 నెలలుగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా అమలు చేస్తున్న నెట్‌వర్క్ ప్రైవేట్ హాస్పిటల్స్‌కు చెల్లించవలసిన బకాయిలు చెల్లించలేదనే నెపంతో శుక్రవారం నుండి వైద్యసేవలు నిలిపివేశారని, దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విశాఖ జిల్లాలో 62 హాస్పిటల్స్ ఎన్టీఆర్ వైద్యసేవలు అందిస్తుండగా అందులో 27 హాస్పిటల్స్ బకాయిలు చెల్లించలేదని చెప్పి చేతులెత్తేసారని, తక్షణం బిల్లులు చెల్లించి, వైద్యసేవలు కొనసాగించాలని కోరారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌కి చెల్లించే నగదుతో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఆసుపత్రులు నిర్మిస్తే బాగుంటుందని ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెయ్యల నాగభూషణరావు ,ఎం.మన్మధరావు, క్షేత్రపాల్‌రెడ్డి, పార్టీ జిల్లా సమితి సభ్యులు సిహెచ్.కాసుబాబు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు పుష్పలత, మత్స్య కార్మిక సంఘం నాయకులు కోడా వజ్రం, మీసాల శ్రీనివాస్, మత్స్యకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వాసుపల్లి నల్లయ్య , అరిలోవ సిపిఐ శాఖ కార్యదర్శి లక్ష్మణరావు, అత్తిలి రవి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు బాలాజీనగర్‌కు చెందిన పీసా త్రిమూర్తులు (37) ఇంట్లో ఫ్యాన్‌కు డోర్ కర్టెన్‌తో ఉరేసుకుని సోమవారం మధ్యాహ్నం ఆత్మ హత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. నిర్మాణ రంగంలో రోజు కూలీగా పని చేస్తున్న త్రిమూర్తులు గత ఐదేళ్లుగా థైరాయిడ్, శ్వాస, కోశ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆరోగ్యం సహకరించక పోవడంతో పనికి వెళ్లడం లేదు. ఆర్థిక సమస్యలు ఎక్కువయ్యాయి. మందులు కూడా వాడడం మానేశాడు. ఈ క్రమంలో ఇంట్లో హాల్‌లో ఫ్యాన్‌కు డోర్ కర్టెన్‌తో ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. సరోజినితో ఇతనికి వివాహమై సుమారు 16 ఏళ్లు అయింది. వీరికి 14 ఏళ్ల కుమార్తె, 12 ఏళ్ల కుమారుడు ఉన్నారు. పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. మృతుని భార్య ఆనందపురంలోని మిఠాయి దుకాణంలో పని చేస్తోంది. ఆమె మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చేసరికి భర్త ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్నాడు. ఆమె వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇరుగు పొరుగు వారి సాయంతో అతన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎ.అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు అదృశ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కోట వీధికి చెందిన దాసరి శ్రీనివాస్ (62) ఈ నెల 12వ తేదీ నుంచి కనబడుట లేదని అతని భార్య స్థానిక పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ బి.ప్రసాదరావు కథనం ప్రకారం.. దాసరి శ్రీనివాస్ గత కొంత కాలంగా మతి స్థిమితం సరిగా లేక బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో 12వ తేదీ రాత్రి 7 గంటలకు ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల ఉన్న స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంపాలెంలోని ఎయు భూముల పరిశీలన

ప్రజాశక్తి-విశాఖపట్నం : నగరంపాలెంలో ఉన్న ఆంధ్రా విశ్వవిద్యాలయానికి చెందిన భూములను ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, డీన్ కె.శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ కార్యాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇక్కడ ఏయూకు సుమారు 137 ఎకరాల భూమి ఉంది. తాజాగా ఆదివారం అధికారుల పరిశీలనలో కొంత భూమి ఆక్రమణలకు గురవుతోందని, మరికొంత స్థలంలో అనధికార రహదారి నిర్మాణం జరుగుతోందని గుర్తించారు. ఏయూ ఉపకులపతి విశ్వవిద్యాలయ సరిహద్దులను త్వరగా నిర్ధారించి భూమిని పరిరక్షించే విధంగా అవసరమైన చర్యలను సత్వరం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. హనుమంతవాక వద్ద ఉన్న బోటనీ ప్రయోగశాలకు వినియోగించే స్థలాన్ని పరిశీలించారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత

-హెల్త్ సెంటర్‌ను సందర్శించిన ఉపకులపతి ఆచార్య రాజశేఖర్

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం కల్పించే విధంగా వైద్య సిబ్బంది పనిచేయాలని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన ఏయూ డిస్పెన్సరీని సందర్శించారు. నూతనంగా నియమితులైన ముగ్గురు వైద్య సిబ్బంది, ఇద్దరు ఫార్మసీ సిబ్బంది, ముగ్గురు నర్సింగ్ సిబ్బందితో మాట్లాడారు. నూతనంగా విధుల్లో చేరిన వీరికి దిశానిర్దేశం చేశారు. ప్రతీ విద్యార్థికి అవసరమైన వైద్యసేవలను సత్వరం, సకాలంలో అందించాలని సూచించారు.

ఘనంగా ఆర్థరైటిస్ దినోత్సవం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం ఆసుపత్రి (జిమ్సర్) ఆధ్వర్యంలో కీళ్ళనొప్పులపై ప్రజలలో అవగాహన కల్పించడానికి ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక పెదజాలరి పేటలోని సామాజిక వైద్య కేంద్రంతో పాటు గీతం ఆసుపత్రి ఆవరణంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గీతం ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ, దేశంలో 62.35 మిలియన్ల జనాభా రకరకాల కీళ్ల వ్యాధులతో బాధపడుతున్నారని, ముఖ్యంగా 45 సంవత్సరాల పైబడిన వారిలో ఈ సమస్య అధికంగా ఉంటుందని తెలిపారు.

రాట వేస్తున్న గౌరీ సంఘం సభ్యులు

గౌరీ పరమేశ్వరుల ఉత్సవ రాట

ప్రజాశక్తి-పాడేరు:.ప్రతి సంవత్సరం పాడేరులో కార్తీకమాసంలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నెల రోజులపాటు జూనియర్ కాలేజీ మైదానం వద్ద నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వరుల మహెూత్సవాలకు సోమవారం గౌరీ సంఘం సభ్యులు ఉత్సవరాట ప్రతిష్ఠించారు. ఈనెల 18 శనివారం గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని నవంబర్ 15 వరకు జరిగే మహెూత్సవాలకు ప్రతిరోజు పూజలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల సతీష్, ఎల్లపు మోహన్, బొడ్డేటి ఆనందరావు, కొణతాల ప్రశాంత్, పీలా కొండలరావు, తనకాల సూరిబాబు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

నకిలీ మద్యంపై వైసిపి నిరసనలు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: నకిలీ మద్యాన్ని అరికట్టాలని రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు అరకులోయ మండల కేంద్రంలోని సోమవారం ఎంపీడీవో కార్యాలయం నుండి ఎక్సైజ్ ఆఫీస్ వరకు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ సీఐకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు రేగం చాణక్య, అరకులోయ జెడ్పిటిసి శెట్టి రోషిని మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం నకిలీ మద్యాన్ని తయారు చేసి బెల్ట్ షాప్‌లో అనుమతి ఇచ్చి విచ్చల విడిగా అమ్మకాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని సేవించి చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, నకిలీ మద్యాన్ని నియంత్రించకపోతే భవిష్యత్తులో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి, వైస్ వైస్ ఎంపీపీలు గంజాయి సుశీల, రామన్న, ఆనంద్, డుంబ్రిగూడ, అరకలోయ మండల అధ్యక్షులు పాంగి పరశురాం, రామ్మూర్తి, జెడ్పిటిసి జానకమ్మ, ఎంపీపీ బాకా ఈశ్వరి, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, వైసీపీ సీనియర్ నేత కమిడి అశోక్, వైసిపి నేతలు పోండోయి అశోక్, పాంగి నర్సింగరావు పాల్గొన్నారు.

ఏషియన్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌కు అంపైర్‌గా డివిఎస్‌వై.శర్మ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: విశాఖపట్నం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయంలో హెచ్‌జిఎగా విధులు నిర్వహిస్తున్న డి.వి.ఎస్.వై .శర్మ ఒరిస్సా, భువనేశ్వర్‌లో జరిగే ఏషియన్ టేబుల్ టెన్నిస్‌టీం ఛాంపియన్‌షిప్‌లో బ్లూబ్యాచ్ ఇంటర్నేషనల్ ఎంపైర్‌గా ఎంపికయ్యారని టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తెలిపింది. ఆయన గత నెలలో టేస్కెంట్‌లో జరిగిన ప్రపంచ టేబుల్ టెన్నిస్ పోటీలకు, లావోస్‌లో జరిగిన ప్రపంచ టేబుల్ టెన్నిస్ పోటీలకు భారతదేశం నుండి టెక్నికల్ అఫీషియల్‌గా విధులు నిర్వహించారు. ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్‌దాస్, మేనేజర్ పర్సనల్ డి.రామారావు ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, అధ్యక్షులు ఎం కామేశ్వరి, విశాఖ జిల్లా కేబుల్ టెన్నిస్ అధ్యక్ష కార్యదర్శులు జే.కె.నాయక్, కెవిఎంఎం.పాత్ర అభినందించారు.